

టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.22 పలికింది. మచ్చలు, తేమను సాకుగా చూపి 102 టన్నుల సరుకును కొనుగోలు చేయలేదు.

గరిష్టం/కనిష్టం

34.5°/22.7°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రేపు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఉండదు

పుట్టపర్తి అర్బన్: కృష్ణాష్టమి సందర్భంగా 26వ తేదీ సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించినందువల్ల కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఈ రోజు రద్దు చేసినట్లు కలెక్టర్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఆ రోజు అర్జీలిచ్చేందుకు ఎవరూ రావొద్దని విజ్ఞప్తి చేశారు.

27 నుంచి క్రీడా పోటీలు

పుట్టపర్తి అర్బన్: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 27, 28, 29 తేదీల్లో క్రీడా పోటీలు, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చేతన్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 27వ తేదీ రామగిరి క్రీడా వికాస్ కేంద్రంలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, క్రీడా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 28వ తేదీన ధర్మవరం ఉన్నత పాఠశాలలో హాకీ టోర్నమెంట్, 29వ తేదీన బుక్కపట్నంలో ర్యాలీ, పుట్టపర్తిలో ధ్యాన్ చంద్ జన్మదిన వేడుకలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు సత్కారం, క్రీడాకారుల చలన చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

కూటమి నేతల ముష్టి యుద్ధం

- నడిరోడ్డుపై కొట్టుకున్న జనసేన, టీడీపీ నేతలు



సోమందేపల్లి: టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఆధిపత్య పోరు రోజురోజుకూ పెరుగుతోంది. తమ పార్టీ అధినేత గొప్ప అంటే... కాదు తమ అధినేతే గొప్ప అంటూ ఆయా పార్టీ నాయకులు వాదులాడుకుంటున్నారు. తాజాగా మండలంలోని మేకలపల్లి గ్రామంలో జనసేన, టీడీపీ నేతలు భౌతిక దాడులు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రస్తుతం ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చలవతోనే టీడీపీ అధికారంలోకి వచ్చిందని ఆ పార్టీ కార్యకర్త వెంకటేష్ చెప్పగా, పవన్ కల్యాణ్‌కు రాజకీయ గురువు తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అని టీడీపీ కార్యకర్త మొద్దన్న బదులిచ్చాడు. దీంతో ఇరువురు తీవ్ర స్థాయిలో దూషించుకున్నారు. అనంతరం మాటామాటా పెరిగి నడిరోడ్డుపైనే కొట్టుకున్నారు. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు అవాక్కయ్యారు. కాగా ఇటీవల గ్రామంలో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుడు గంగాధరప్పపై జనసేన మద్దతుదారుడు సిద్దప్ప గెలుపొందారు. అప్పటి నుంచి గ్రామంలో తరుచూ జనసేన, టీడీపీ నేతల మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఘటన అనంతరం ఇరువర్గాలు మంత్రి సవిత ముందు పంచాయితీ పెట్టినట్లు తెలిసింది.

స్వాగతం కృష్ణా..



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు

ప్రశాంతి నిలయం: కృష్ణాష్టమి వేడుకలు శనివారం ప్రశాంతి నిలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి భక్తిగీతాలు ఆలపించారు. స్వాగతం కృష్ణా అంటూ శ్రీ కృష్ణుడికి లీలను వివరించారు.

అతిసారం నివారణకు ప్రత్యేక చర్యలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో అతిసారం నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది అన్ని శాఖలను సమన్వయం చేసుకుని అతిసారంపై ప్రజలకు అవగాహన కల్పించి నియంత్రణలోకి తీసుకురావాలన్నారు. వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగడంతో, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఇక 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందిన ప్రతి అర్జీని పరిశీలించి గడువులోపు పరిష్కరించాలన్నారు.



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి

"వైద్య రంగంలో సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి. తద్వారా విధుల్లో ఉన్న వైద్యులపై ఎక్కడైనా దురాగతాలు జరిగితే... ఫిర్యాదు అందిన ఆరు గంటల్లోనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అన్ని ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణ కోసం మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా స్త్రీల పట్ల పురుషుల దృక్పథంలో మార్పు రావాలి. అప్పుడే అత్యాచారాలకు అడ్డుకట్ట పడుతుంది.

– డా. తేజస్విని, చిలమత్తూరు పీహెచ్‌సీ వైద్యురాలు





రాత్రి వేళల్లో రక్షణ తప్పనిసరి

రాత్రి సమయాల్లో ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే వైద్యులకు, వైద్య సిబ్బందికి తప్పని సరిగా రక్షణ అవసరం. కోల్‌కతా ఘటనతో మహిళా సిబ్బంది, వైద్యులు రాత్రి వేళల్లో విధులు నిర్వహించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. 24/7 సేవలు అందించే ఆస్పత్రుల వద్ద రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ కచ్చితంగా అవసరం. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకపోతే ఎలా..?"

– డాక్టర్ నరసింహారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు, హిందూపురం

ముంచుతున్న ప్లాస్టిక్

ప్లాస్టిక్ వ్యర్థాలతో జిల్లాలోని పట్టణాలు కంపుకొడుతున్నాయి. చెత్తకుప్పలు మొదలు డ్రైనేజీ కాలువల వరకూ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిబంధనలకు పాతర వేయడంతో ప్రమాద తీవ్రత ఏటికేటికీ పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం స్పందించడం లేదు. ఓవైపు ప్లాస్టిక్ కవర్ల వాడకం పెరుగుతుండటం, మరోవైపు వాటిని రీసైక్లింగ్ చేసే యూనిట్లు అతి తక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది.



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన అనంతపురం నడిమివంక

- ప్లాస్టిక్ నిబంధనలకు తూట్లు
- మార్కెట్‌లో విచ్చలవిడిగా కవర్లు
- ఎక్కడ చూసినా 20 మైక్రాన్ల కవర్లే
- మున్సిపాలిటీల చెత్తలో సగం ప్లాస్టిక్ వ్యర్థాలే
- పొంచి ఉన్న ప్రమాదకర జబ్బులు
- క్యాన్సర్‌తో పాటు స్త్రీలలో సంతానోత్పత్తి సమస్యలు





అనంతపురం నగరంలోని ఓ కాలువలో ఇలా...

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లాలోని 9 మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ వాడకం తీవ్రంగా ఉన్నట్టు తేలింది. ఒక్క అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే నెలకు 15 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్టు లెక్కగట్టారు. తొలుత 40 మైక్రాన్ల మందమున్న ప్లాస్టిక్ కవర్లు మాత్రమే వాడాలని నిబంధన ఉండేది. అయితే, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2016లో కొత్త నిబంధనలు విధించింది. 50 మైక్రాన్ కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆస్పత్రుల్లో విడుదలవుతున్న బయో వ్యర్థాలపై కూడా ఆంక్షలు విధించింది. ఎక్కడైతే బయో వ్యర్థాలు విడుదలవుతున్నాయో వాటి నిర్వీర్యంలో కూడా ఆ సంస్థలే ప్రధానంగా బాధ్యత వహించాలని సూచించింది. కానీ ఈ నిబంధనలు ఉమ్మడి జిల్లాలో అమలు కావడం లేదు. ఇటీవలి కాలంలో 20 మైక్రాన్ల మందం మాత్రమే ఉన్న ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చాయి. బడ్డీకొట్లు, చికెన్ షాపులు తదితర చోట్ల 20 మైక్రాన్ల ప్లాస్టిక్ కవర్లే వాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు ఉత్పత్తి చేసినా, వినియోగించినా రూ.25 వేల జరిమానా విధించాలని ఉన్నా పట్టించుకునే నాథుడే లేరు.

నియంత్రణ అధికారులు ఏరీ?

నాసిరకం ప్లాస్టిక్ బ్యాగుల నియంత్రణ లీగల్ మెట్రాలజీ పరిధిలోకి వస్తుంది. కానీ వీటిని ఆ శాఖ అధికారులు నియంత్రిస్తున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. పెద్ద పెద్ద మాల్స్‌లో కూడా 20 మైక్రాన్‌ల బ్యాగులు వాడుతున్నా పట్టించుకోవడం లేదు. కొన్ని టీస్టాళ్లలో వేడి వేడి టీని కూడా ఇలాంటి కవర్లలోనే పార్సిల్ చేసి ఇస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నా ఎవరూ అటువైపు చూడటం లేదు.

ఏది సురక్షితం.. ఏది హానికరం?

ప్లాస్టిక్ తయారీ వస్తువులకు నంబర్లు ఉంటాయి. వీటిలో ఒక్కో నంబరు ఒక్కో క్వాలిటీని సూచిస్తుంది.

- 1, 2, 4, 5 నంబర్లు సూచించే ప్లాస్టిక్‌ను వాడుకోవచ్చు.
- 3, 6, 7 నంబర్లు ఉన్న ప్లాస్టిక్‌ను దూరంగా ఉంచడం మంచిది.
- ప్లాస్టిక్ వస్తువుల మీద ఈ నంబర్లు సూచించే వాటిని తీసుకోవచ్చు.
- 30 లేదా 20 మైక్రాన్‌ల కంటే తక్కువ దళసరి ఉన్న ప్లాస్టిక్ బ్యాగులు నేరుగా హాని తలపెడతాయి.
- పాలీవినైల్ లేదా పీవీసీ అనే ప్లాస్టిక్‌ను వాడకూడదు.
- మైక్రో ఓవెన్లలో ప్లాస్టిక్‌లో ఆహార పదార్థాలను ఉంచి వేడిచేసి తినకూడదు.
- చల్లటి నీరైనా, వేడి పానీయాలైనా పాలీకార్బొనేట్ ప్లాస్టిక్ బాటిళ్లలోనే నింపి తాగేందుకు వాడుకోవాలి.
- 'పాథలేట్-ఫ్రీ' లేదా 'బీపీఏ-ఫ్రీ' అనే లేబుళ్లు ఉన్న వస్తువులనే వాడుకోవాలి.
- చిన్నపిల్లల పాల బాటిళ్లు, నీళ్ల బాటిళ్లలో 'బీపీఏ-ఫ్రీ' అని సూచించే వాటినే వాడాలి.

ప్లాస్టిక్ వ్యర్థాలతో భయంకర జబ్బులు

- ప్లాస్టిక్ బ్యాగుల్లో నిల్వ ఉంచి ఆ పదార్థాలను తినడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ.
- మహిళల్లో పునరుత్పత్తి ప్రక్రియకు హాని చేసే అవకాశాలున్నాయి.
- వ్యాధి నిరోధకత భారీగా తగ్గే అవకాశముంది.
- జీర్ణకోశ వ్యాధులు ఎక్కువగా వస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు.
- లైంగిక సంబంధమైన హార్మోన్లు క్రమంగా తగ్గే అవకాశాలుంటాయి.
- వ్యాధికారక పదార్థమైన పాథలేట్స్ శరీరంలోకి చేరి పలు రకాల జబ్బులను చేస్తాయి.
- గుండె జబ్బులు రావడానికి కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు కారకాలుగా ఉన్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ మున్సిపాలిటీల్లో నెలకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా

మున్సిపాలిటీ/ కార్పొరేషన్	ప్లాస్టిక్ వ్యర్థాలు (టన్నుల్లో)
అనంతపురం	15.7
గుంతకల్లు	8.2
గుత్తి	1.02
హిందూపురం	8.43
తాడిపత్రి	0.8
ధర్మవరం	0.96
రాయదుర్గం	0.84
కదిరి	0.96
పెనుకొండ	0.65
మొత్తం	37.56

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం



ప్లాస్టిక్ నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించాం. నిషేధిక ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించరాదు. ప్లాస్టిక్ నియంత్రణకు తరచూ డ్రైవ్‌లు చేపడుతున్నాం. ప్రజలు సైతం నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకూడదు. పర్యావరణంతో పాటు మనుషులకు సమస్యగా మారుతుంది. సామాజిక స్పృహతో ప్లాస్టిక్‌ను వాడకుండా ఉండాలి.

– పీవీవీఎస్ మూర్తి, మునిసిపల్ ఆర్‌డీ

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం




నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం. మనం తీసుకునే ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లడం, అందులోని పదార్థాలను తీసుకోవడం వల్ల ప్రమాదకర మూత్రాశయ కేన్సర్ బారిన పడడం, ప్లాస్టిక్ రేణువులు మెదడులోకి వెళ్లి సమస్యలు వస్తాయి. సాధ్యమైనంత వరకూ నిషేధిత ప్లాస్టిక్‌కు దూరంగా ఉండడం ఆరోగ్యకరం.

– డాక్టర్ షంషాద్‌బేగం, గైనిక్ హెచ్‌ఓడీ, జీజీహెచ్

'కలుపు మొక్కల'కు ఖాకీ అండ!

- సిబ్బందిని కాపాడేందుకు డీఎస్పీ పాట్లు
- ప్రాథమిక విచారణ చేస్తే వాస్తవాలు తెలుస్తాయంటున్న జనం



సాక్షి, టాస్క్‌ఫోర్స్: పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారి... వారిని కాపాడేందుకు పూనుకున్నారు. ఈనెల 20 తేదీ రాత్రి ఫారెస్ట్ , సెబ్ అధికారుల మధ్య గొడవ జరగడం, బాహాబాహీకి దిగడంపై ఈనెల 21న 'వసూళ్ల కోసం బాహాబాహీ' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అదే విధంగా 'ఖాకీ వనంలో కలుపు మొక్కలు' శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. ఈ రెండు కథనాలు అవాస్తవాలంటూ హిందూపురం నూతన డీఎస్పీ మహేష్ శనివారం ఓ ప్రెస్‌నోట్ విడుదల చేశారు. 'సాక్షి' ప్రచురించిన కథనం ఆధారంగానే అగళి హెడ్‌కానిస్టేబుల్‌ను ఎస్పీ రత్న శుక్రవారమే సస్పెండ్ చేశారు. మిగతా అంశాలపైనా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కానీ విధుల్లో చేరీ చేరగానే డీఎస్పీ మహేష్ మాత్రం అవన్నీ అవాస్తవాలంటూ కొట్టిపారేశారు. కనీసం ప్రాథమిక విచారణ చేయకుండానే 'సాక్షి' కథనాన్ని ఖండించడం గమనార్హం. సాక్షాత్తూ కొడికొండ చెక్‌పోస్ట్ సెబ్ సీఐ శ్రీరాములు సమక్షంలోనే ఘర్షణ జరగడం.. ఆయనే స్వయంగా ఈ విషయాన్ని ధ్రువీకరించినా డీఎస్పీ మాత్రం నిరాధార కథనం అంటూ ప్రెస్‌నోట్లో పేర్కొన్నారు. పోలీసుశాఖ ప్రతిష్ట కోసం తాపత్రయ పడుతున్న డీఎస్పీ... 'సాక్షి' కథనాల్లోని అంశాలపై కనీస విచారణ చేసినా వాస్తవాలు తెలుస్తాయని, అలాగే చిలమత్తూరు మండలంలో ఇష్టారాజ్యంగా సాగుతున్న ఇసుక, కర్ణాటక మద్యం అక్రమ రవాణా గురించి తెలుస్తుందని జనం అంటున్నారు. రెండు రోజుల క్రితం శెట్టిపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ దుకాణదారుడిని పట్టుకువచ్చిన పోలీసులు...ఎలాంటి చర్యలు తీసుకోకుండానే ఎందుకు వదిలేశారో కూడా తెలుస్తుందంటున్నారు. ఇప్పటికైనా డీఎస్పీ మహేష్ సిబ్బంది వ్యవహారంపై విచారణ చేసి పోలీసు శాఖ ప్రతిష్టను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

భద్రత మరింత మెరుగుపరచాలి

- సత్యసాయి విమానాశ్రయం అధికారులతో కలెక్టర్ టీఎస్ చేతన్



ఎయిర్‌పోర్టు భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్: పోలీసులు, జిల్లా అధికారులు, సత్యసాయి విమానాశ్రయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాణాలు పెంచి మెరుగైన భద్రత కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. శనివారం పుట్టపర్తి విమానాశ్రయంలో ఎయిర్‌పోర్టు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ చేతన్, విమానాశ్రయం డైరెక్టర్ సాయినాథరెడ్డి, అడ్మిన్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ భాగ్యరేఖతో పలువురు అధికారులు పాల్గొన్నారు. విమానాశ్రయంలో భద్రతాపరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఏయే శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, విమానాశ్రయంలో భద్రతా పరమైన సమస్యలు పరిష్కరించాలంటే ప్రభుత్వశాఖల అధికారులు, విమానాశ్రయం నిర్వాహకుల మధ్య సమన్వయం అవసరమన్నారు. విమానాశ్రయాన్ని కమర్షియల్ ఎయిర్‌పోర్టుగా ప్రజలకు ఉపయోగపడేవిధంగా తీర్చిదిద్దుతామని, ఇందుకోసం సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపుతామన్నారు. సమావేశంలో డీఎస్పీ విజయకుమార్, ఫైర్‌సేఫ్టీ అధికారి హేమాద్రిరెడ్డి, తహసీల్దార్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరగాలి

పుట్టపర్తి అర్బన్: 'వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం మరింత పెరగాల్సిన అవసరం ఉందని, ఇందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, మార్కెటింగ్ జిల్లా అధికారి నరసింహమూర్తి, మండల ఉద్యాన శాఖ అధికారి నవీన్‌కుమార్ తదితరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో టమాట, మామిడి, వక్క, చీనీతోటల విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఆయా పంటలు సాగుచేసే రైతులు అధిక దిగుబడి సాధించేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే పంటల యాజమాన్యం గురించి రైతులకు వివరించాలన్నారు. పంటల సాగులో రైతులకు శిక్షణ, ఉద్యాన ఉత్పత్తుల గ్రేడింగ్ కోసం ప్యాక్ హౌస్‌ల నిర్మాణం, ఎగుమతులపై దృష్టి సారించాలన్నారు. మామిడి అధికంగా సాగయ్యే బుక్కపట్నం మండలంలో మార్కెట్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి



శనీశ్వరుడిని దర్శించుకునేందుకు క్యూలో వెళ్తున్న భక్తులు



శనీశ్వర దర్శనానికి తరలి వచ్చిన జనం

శ్రావణం.. భక్త సాగరం

పావగడ: శ్రావణ మాసంలో వచ్చిన మూడో శనివారం స్థానిక శనీశ్వరాలయం భక్తులతో పోటెత్తింది. శ్రావణ బహుళ పంచమిని పురస్కరించుకుని అర్చకులు గర్భగుడిలోని మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణశాస్త్రి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కలశ స్థాపన, గణపతి, నవగ్రహ పూజలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, తైలాభిషేకం, కుంకుమార్చన, ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక భవనంలో ఏర్పాటు చేసిన సామూహిక నవ గ్రహాల తైలాభిషేకంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. అనంతరం అమ్మవారు శీతలాంబదేవికి సహస్ర కుంకుమార్చన చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావు, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి సుబ్బనరసింహ తదితరులు ఏర్పాట్లు చేశారు. అన్నదానంతో పాటు వసతి సౌకర్యం కల్పించారు. సీఐ సురేశ్ నేతృత్వంలో ఆలయం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



శనిమహాత్ముడి వాహనం వాయసం(కాకి)

క్లుప్తంగా

మీ సేవలు మరువలేనివి



బదిలీపై వెళ్తున్న పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: విధి నిర్వహణలో మీరు అందించిన సేవలు మరువలేనివని ఎస్పీ రత్న కొనియాడారు. శనివారం ఎస్పీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బదిలీపై వెళ్తున్న అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీలతకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన పట్టుగూళ్లకే మంచి ధరలు



హిందూపురం: నాణ్యమైన పట్టుగూళ్లకు మంచి ధరలు లభించే అవకాశాలు ఉన్నట్లు ప్రభుత్వ పట్టు గూళ్ల మార్కెట్ అధికారి లక్ష్మిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం వారం రోజులుగా హిందూపురంలో వర్షాలు లేవని, బైవోల్టిన్ రైతులు పట్టు గూళ్లను రాత్రి లేదా ఉదయాన్నే మార్కెట్‌కు తీసుకురావచ్చని చెప్పారు. హిందూపురం మార్కెట్ యార్డులో 80మంది మల్టీ ఎండ్ రీలర్లు ఉన్నారని, ఒక్కొక్కరికి రోజుకు రెండు లాట్‌లు అవసరం ఉంటుందని తెలిపారు. గాలిలో తేమ ఎక్కువగా ఉండడంతో గూడు నాణ్యత తగ్గుతుందని, రైతులు నేత్రికలు పరచిన తర్వాత వర్షం వచ్చినా రాకున్నా పురుగుల పెంపకపు గదిలో కిటికీలు తెరిచి ఉంచి పొడి వాతావరణం ఏర్పాటు చేసుకోవడానికి కృషిచేయాలని సూచించారు.



సీహెచ్‌సీలో భద్రత కల్పించాలి

రొళ్ల సీహెచ్‌సీలో రాత్రి విధులు నిర్వహించే వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. భవనం మధ్యలో పైభాగం ఖాళీగా ఉంది. దీంతో రాత్రి సమయంలో ఖాళీ స్థలం ద్వారా వ్యక్తులు లోపలికి వచ్చే అవకాశం ఉంది. రాత్రి వేళ ఆస్పత్రికి వచ్చే వారిలో మద్యం మత్తులో ఉన్నవారు దురుసుగా ప్రవర్తిస్తుంటారు. పోలీసుల భద్రత ఏర్పాటు చేసి వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

– మంజుల, స్టాఫ్‌నర్స్, సీహెచ్‌సీ, రొళ్ల



ప్రత్యేక చర్యలు చేపట్టాలి

మహిళా వైద్యులు, సిబ్బంది కోసం ప్రభుత్వం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలి. 24 గంటల పాటు వైద్యసేవలు అందించే వారికి రక్షణ అత్యవసరం. రాత్రి వేళల్లో వచ్చే రోగులలో కొందరు దురుసుగా వ్యవహరించేవారు ఉంటారు. అలాంటి వారి వల్ల అప్పుడప్పుడు ఇబ్బందులు ఎదురవుతూ ఉంటాయి. ఆస్పత్రిలో పురుష, మహిళ వాచ్‌మెన్లను నియమించాలి. భద్రతగా ఉంటే వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన సేవలందించడానికి అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి.

– ఓంకార్, వైద్యుడు, సోమందేపల్లి



మౌలిక సౌకర్యాలు మృగ్యం

- పుట్టపర్తి మున్సిపాలిటీలో గాడి తప్పిన పాలన
- ప్రజా సమస్యలు పట్టించుకోని అధికారులు
- ఇరవై రోజులైనా తీరని తాగునీటి వెతలు



పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం



తాగునీటి కోసం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ప్రజలు (ఫైల్)

పుట్టపర్తి టౌన్: ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. నిధులు పుష్కలంగా ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోంది. మౌలిక సదుపాయాలు కల్పించలేని దుస్థితి నెలకొంది. పాలకవర్గం.. అధికారుల మధ్య సమన్వయలోపమే ఇందుకు కారణం. మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉన్నాయి. జనరల్ ఫండ్స్, 15, 16వ ఆర్థిక సంఘం నిధులు మెండుగా ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పనీ ముందుకు సాగడం లేదు. అధికారులు ఉదయం విధులకు హాజరై రిజిష్టర్‌లో సంతకాలు చేసి.. బాతాఖానీ కొట్టడం మినహాయిస్తే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కానీ.. సమస్యలు పరిష్కరించాలని కానీ బాధ్యత ఉండడం లేదు. కమిషనర్ వేధిస్తున్నారని ఉద్యోగులు.. ఉద్యోగులు విధి నిర్వహణలో సహకరించడం లేదని కమిషనర్ ఇలా ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడానికే సమయమంతా సరిపోతోంది.

సమస్యల దరువు..

మున్సిపల్ పాలకవర్గానికి అధికారుల నుంచి సహకారం కొరవడింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు స్తబ్దుగా ఉంటున్నారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి కూడా ఆసక్తి చూపడం లేదు. దీంతో సమస్యలు దరువేశాయి. ఇరవై రోజులుగా మున్సిపాలిటీలోని పది వార్డుల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. 60 మోటార్లలో 10 కాలిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపించింది. మోటార్ల మరమ్మతులు, వీధిలైట్ల నిర్వహణ కూడా గాలికొదిలేశారు. పది రోజుల కిందట రెండో వార్డు ప్రజలు తాగునీటి కోసం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించిన విషయం విదితమే.

ప్రజా సొమ్ము దుర్వినియోగం

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజా సొమ్ము దుర్వినియోగమవుతోంది. మోటార్ పంప్‌సెట్లు, చెత్త తరలించే వాహనాల మరమ్మతులకు నోచోకోలేదు. ఇదే క్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సిఫార్సు మేరకు వాటర్ ట్యాంకులు, చెత్త తరలింపు ట్రాక్టర్ల నిర్వహణ కాంట్రాక్టులకు అనుమతులు మంజూరు చేశారు. దీంతో అనవసరంగా సొమ్ము దుర్వినియోగమవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి జోక్యం చేసుకుని మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన వ్యక్తి

హిందూపురం అర్బన్: మలుగూరు – హిందూపురం మధ్య శనివారం ధర్మవరం వైపు నుంచి బెంగళూరు వైపు వెళ్లే రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (55) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతున్ని ఎవరైనా గుర్తిస్తే 94407 04699 నంబర్‌కు తెలియజేయాలని రైల్వే ఎస్ఐ బాలాజీ తెలిపారు.

అప్పు చెల్లించలేదని వ్యక్తి హత్య

తాడిపత్రి అర్బన్: అప్పు చెల్లించలేదని వ్యక్తిని హత్య చేసిన ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జ్ అర్బన్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన మేరకు.. పట్టణంలోని జయనగర్ కాలనీకి చెందిన రాజేంద్ర (40) డ్రైవర్. కొన్ని రోజుల క్రితం ఈయన భార్య ఉమాదేవి స్థానిక జయగనగర్ కాలనీలో ఉంటున్న తిప్పారెడ్డి భార్య నాగలక్ష్మీ వద్ద రూ.38 వేలు అప్పుగా తీసుకుంది. అప్పు చెల్లించాలంటూ తిప్పారెడ్డి, నాగలక్ష్మీ ఉమాదేవి ఒత్తిడి చేస్తుండడంతో శనివారం ఈ విషయాన్ని ఉమాదేవి తన భర్తతో చెప్పడంతో రాజేంద్ర శనివారం తిప్పారెడ్డి ఇంటి వద్దకు వెళ్లాడు. కొన్ని రోజుల తరువాత అప్పు చెల్లిస్తామని చెప్పాడు. ఈ క్రమంలోనే తిప్పారెడ్డి, అతని భార్య నాగలక్ష్మీ, వారి తమ్ముడి కుమారులకు, రాజేంద్రకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అంతా కలిసి రాజేంద్రపై దాడికి పాల్పడ్డారు. కొంతసేపటికి అక్కడి నుంచి బయలుదేరిన కొద్దిదూరంలోనే ఉన్నట్లుండి కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమాదేవి పరుగున అక్కడికి వచ్చి బోరున విలపించింది. అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిప్పారెడ్డి, భార్య నాగలక్ష్మీ, అతని సోదరుల కుమారులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీఓ 84 రద్దు చేయాలి



ఎంఈఓలకు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: మున్సిపల్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీఓను రద్దు చేయాలని మున్సిపల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్‌లకు వినతిపత్రం అందించారు. ఏపీఎంటీఎఫ్ గౌరవాధ్యక్షుడు రాం ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్, ఫ్యాప్టో కార్యదర్శులు రవీంద్రరెడ్డి, రామకృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీఓ 84ను రద్దు చేయాలన్నారు. ప్రతి మున్సిపాలిటీలోని సీనియర్ ఉపాధ్యాయుడిని ఎంఈఓగా నియమించి మున్సిపల్ ఎడ్యుకేషన్ వింగ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని మాధ్యమిక, ఉన్నత పాఠశాలలకు పోస్టులు కేటాయించాలని, ఉపాధ్యాయులు, విద్యార్థి రేషియోకు అనుగుణంగా అదనంగా ఉన్న ఇతర మున్సిపాలిటీ నుంచి ఉపాధ్యాయులను అవసరం ఉన్న పాఠశాలకు బదిలీ నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న సర్దుబాటులో భాగంగా బలవంతంగా ఎస్‌జీటీలను ఉన్నత పాఠశాలకు పంపి బోధన చేయించడం వల్ల నాణ్యతా ప్రమాణాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. వెంటనే మున్సిపల్ పాఠశాలలో ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ద్వారా నింపి విద్యార్థుల భవిష్యత్తుకు సహకరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కార్యదర్శులు నాగప్ప, ఉమాపతి, జగదీష్, సాయిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం






మృతి చెందిన సరోజమ్మ, గాయపడిన వెంకటనారాయణ. చరణ్, అలేఖ్య

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

బత్తలపల్లి: దైవ దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో మహిళ మృతి చెందగా.. ఆమె భర్త, మనవడు, మనవరాలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు... తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన చాకలి వెంకటనారాయణ, సరోజమ్మ(40) దంపతులు. శ్రావణ మాస మూడో శనివారాన్ని పురస్కరించుకుని అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయానికి మనవడు చరణ్, మనవరాలు అలేఖ్యతో కలిసి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. బత్తలపల్లి మండలం లింగారెడ్డిపల్లి క్రాస్ వద్దకు రాగానే అనంతపురం వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. బైక్‌పై నుంచి నలుగురు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో సరోజమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. భర్త వెంకటనారాయణ, మనవడు, మనవరాలు తీవ్రంగా గాయపడడంతో వారిని స్థానికులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సరోజమ్మకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగులకు రేపు బదిలీల కౌన్సెలింగ్

- అనంతపురం కేంద్రంగా జోన్–4 పరిధిలోని ఉద్యోగులకు కౌన్సెలింగ్
- ప్రత్యేకాధికారిగా ఈఎన్‌సీ బాలు నాయక్

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సోమవారం బదిలీలపై కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. అనంతపురం కేంద్రంగా జోన్–4 పరిధిలోని రాయలసీమ జిల్లాల ఇంజినీరింగ్ సహా ఇతర అన్ని రకాల క్యాడర్ల ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, టెక్నికల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహణ ప్రత్యేకాధికారిగా పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.బాలు నాయక్‌ను ప్రభుత్వం నియమించింది.

మృతురాలి ఆచూకీ లభ్యం

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్ గేట్ సమీపంలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్న మృతురాలి ఆచూకీ లభ్యమైంది. 'గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనం చూసిన బంధువులు శనివారం రైల్వే పోలీసులను సంప్రదించారు. చనిపోయినది యర్రంపల్లికి చెందిన శివారెడ్డి భార్య శ్రీవిద్య అని తెలిపారు. అనారోగ్యం.. సంతానభాగ్యం లేకపోవడంతో విరక్తి చెంది ఆత్మ హత్య చేసుకున్నట్లు తేల్చారు.

ఆంజనేయా.. పాహిమాం




అలంకరణలో పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి, దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

నల్లచెరువు: పాలపాటిదిన్నె క్షేత్రం ఆంజనేయ స్వామి నామస్మరణతో ప్రతిధ్వనించింది. శ్రావణ మాసం మూడో శనివారం ఉత్సవాల సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిట లాడింది. వివిధ ప్రాంతాల నుండి భక్తులు వేల సంఖ్యలో హాజరై ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేకువజామునే స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. ఈఓ రవీంద్రరాజు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగుల సహకారంతో భక్తులకు ఆలయ అధికారులు అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో డాక్టర్ కల్పనరెడ్డి వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి హెల్త్ క్యాంప్ నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ లింగన్న ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విధుల్లోకి జూడాలు, హౌస్‌సర్జన్లు

అనంతపురం మెడికల్: జూనియర్ డాక్టర్లు, హౌస్‌సర్జన్లు విధుల్లోకి చేరారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె కాల్ ఆఫ్ కావడంతో శనివారం ఉదయం 8 గంటల నుంచి యథావిధిగా విధుల్లో పాల్గొన్నారు. కోల్‌కతాలో పీజీ పీజీ విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా 351 మంది పీజీలు, 132 మంది హౌస్‌సర్జన్లు సమ్మెలోకి వెళ్లిన విషయం విదితమే. సమ్మె కాల్ ఆఫ్ కావడంతో శనివారం ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో పీజీ వైద్యులు, హౌస్‌సర్జన్లు చేరారు. వీరు విధుల్లోకి రావడంతో స్టాఫ్‌నర్సులపై పని ఒత్తిడి తగ్గింది. 11 రోజుల పాటు స్టాఫ్‌నర్సులు వైద్యుల విధులను చేపట్టారు.

ఊరంతా.. హనుమంతులే!




పురాతన అంజనేయస్వామి మూల విరాట్, గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం



కనుమర గ్రామం

రొద్దం: తమను మహమ్మారి నుంచి కాపాడారన్న నమ్మకంతో ఆ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆంజనేయస్వామి పేరు పెట్టుకుంటూ వస్తున్నారు. కొత్తవారెవరైనా అక్కడకు వచ్చి తమకు తెలిసిన హనుమంతు.. అంజనేయులు పేరు పిలిస్తే మాత్రం ఊరంతా పలుకుతారు. ఆ గ్రామం పేరు కనుమర. గ్రామంలో పురాతన ఆంజనేయ స్వామి ఆలయం ఉంది. ఒకప్పుడు కలరా వ్యాధి ప్రపంచాన్ని వణికించిందని, అయితే ఆంజనేయ స్వామి తమ గ్రామంలో ఆ మహమ్మారి బారిన పడకుండా కాపాడారని ప్రజలు ఇప్పటికీ చెబుతుంటారు. అందుకే అప్పటి నుంచి పుట్టిన ప్రతి ఒక్కరికీ స్వామి పేరు వచ్చేలా హనుమంతు, హనుమక్క, ఆంజనేయులు, సంజీవప్ప నామకరణం చేస్తూ వస్తున్నారు. గ్రామ జనాభా 250. దాదాపు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో 45 మంది ఆంజనేయులు పేరుతోను, 20 మంది సంజీవప్ప పేరుతోను, 47 మంది హనుమంతు పేరుతోను, 20 మంది సంజీవమ్మ పేరుతోను ఉన్నారు.

భక్తితో నామకరణం



మా ఊరిలో పురాతన ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. కంటికి రెప్పలా కాపాడుతూ వస్తున్నారని తమ పెద్దవారు స్వామి పేరు వచ్చే విధంగా పేర్లు పెట్టారు. గ్రామంలో ఎక్కువమందికి హనుమంతు, ఆంజనేయులు, సంజీవప్ప, సంజీవమ్మ పేర్లే ఉంటాయి. ఏదైనా ప్రభుత్వ పథకాలు వస్తే అధికారులు ఒకే రకంగా పేర్లు ఉండడంతో ఇబ్బందులు పడుతుంటారు.

– ఆంజనేయులు, కనుమర